సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



ఫిర్యాదులు పరిష్కరించాలి
ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు.
- 8లో ▸



స్పెల్‌బీకి విశేష స్పందన
'సాక్షి' మీడియా గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో నిర్వహించిన స్పెల్‌బీ పోటీలకు స్పందన లభించింది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.2 /16.9

వాతావరణం
ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావొచ్చు. సాయంత్రం చల్లటిగాలులు వీస్తాయి. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎన్డీఎస్‌ఎల్ కార్మికుల దీక్ష విరమణ



బోధన్ : ఎన్డీఎస్‌ఎల్ కార్మికులు తమకు రావాల్సిన బకాయి వేతనాలు, మృతిచెందిన వారి కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలనే డిమాండ్లతో 129రోజులుగా బోధన్ పట్టణంలో చేస్తున్న రిలేదీక్షలను కార్మికులు సోమవారం సాయంత్రం విరమించారు. బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మోహినోద్దీన్, కౌన్సిలర్ మీర్ నజీర్ అలీ(డబ్బు) దీక్షా శిబిరాన్ని సందర్శించారు. పండ్లరసం ఇచ్చి కార్మికుల దీక్షలను విరమింపచేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగేలా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్మిక నాయకుడు నాగేశ్వర్‌రావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌మన్ సస్పెన్షన్

నిజామాబాద్ సిటీ : ఆర్నెళ్లుగా ఉత్తరాలను బట్వాడా చేయకుండా ఇంట్లోనే ఉంచుకున్న పోస్ట్‌మన్ కార్తిక్‌ను పోస్టల్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా తపాలా అధికారి హనుమంతు ఆదేశాల మేరకు డివిజన్ తపాలా అధికారి రాజా నర్సాగౌడ్ సస్పెండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్ తపాల శాఖ బ్రాంచ్‌లో పోస్ట్‌మెన్‌గా ఉన్న కార్తిక్ ఆర్నెళ్లుగా తన పరిధిలో ఉత్తరాలను పంచకుండా ఇంట్లోనే దాచిపెట్టిన విషయం విదితమే. డివిజన్ తపాలా అధికారి రాజా నర్సాగౌడ్ మాట్లాడుతూ వారంరోజుల్లో సదరు ఉత్తరాలన్నీ ఆయా అడ్రస్‌లకు పంపుతామన్నారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ నాగారం : జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం బుధవారం ఉద్యోగమేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎం కంపెనీలో నియామకాలున్నాయన్నారు. విద్యార్హత పదోతరగతి, ఇంటర్, డిగ్రీ వరకు ఉండాలని, జీతం రూ. 20వేల నుంచి రూ. 30 వేల వరకు ఉంటుందని, వయస్సు 18ఏళ్ల నుంచి 30ఏళ్ల వరకు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో, సర్టిఫికెట్స్ తీసుకొని నగరంలోని శివాజీనగర్‌లోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌కు రావాలన్నారు. వివరాలకు 95817 68413, 99487 48428, 99594 56793లో సంప్రదించాలన్నారు.

ఇన్‌చార్జి డీఆర్‌గా ఫణీంద్ర

సుభాష్‌నగర్ : జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌చార్జి డీఆర్‌గా ఆదిలాబాద్ డీఆర్ ఫణీంద్రకు సోమవారం బాధ్యతలు అప్పగించారు. నిజామాబాద్‌లో రెగ్యులర్ డీఆర్‌గా ఉన్న ప్రసన్నకుమారి మూణ్నెళ్లపాటు వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. దీంతో ఇన్‌చార్జి డీఆర్‌గా ఫణీంద్రను నియమించారు. గతంలో ఆయన జిల్లాలో ఇన్‌చార్జి డీఆర్‌గా విధులు నిర్వహించిన విషయం తెలిసిందే.

నేడు సౌత్‌క్యాంపస్‌లో జాతీయ స్థాయి సదస్సు

భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో మంగళవారం వాతావరణ మార్పులపై జాతీయస్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, సదస్సు కోకన్వీనర్లు కే.రాజేశ్వరి, నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా కౌన్సిల్ పర్ గ్రీన్ రివాల్యుయేషన్ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హరిసర్వోత్తం, కౌన్సిల్ పర్ ఎర్త్ లీడర్‌షిప్ అండ్ సస్టైనెబిలిటీ డైరెక్టర్ సాయిభాస్కర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.


మోడల్ స్కూళ్లను ఇంటర్నేషనల్‌గా మార్చాలి

నిజామాబాద్ అర్బన్ : తెలంగాణ మోడల్ స్కూల్స్‌ని ఇంటర్నేషనల్ మోడల్ స్కూళ్లుగా మార్చాలని మోడల్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 194 స్కూళ్లలో 6 నుంచి ఇంటర్ వరకు బోధన కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, బాసర ఐఐఐటి వంటి కళాశాలల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూళ్ల విద్యార్థులు ఎక్కువగా ఉంటారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మండల కేంద్రాల్లో ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను స్థాపిస్తామని ప్రకటించారని, ఈ నేపథ్యంలో మోడల్ స్కూళ్లను మరింత మెరుగుపర్చాలన్నారు.

కార్మికులపైనే ప్రతాపం

- ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డి మాల్ రెంటల్ బకాయిల విషయంలో మీనమేషాలు
- రూ. 7 కోట్లకు పైగా బకాయి పడ్డా పట్టింపులేని వైనం
- మరోవైపు సంస్థ అభ్యున్నతి కోసం పాటుపడుతున్న ఉద్యోగులకు వేధింపులు
- ఇదీ ఆర్టీసీ అధికారుల తీరు

ఆర్టీసీ అభ్యున్నతి కోసం జీతాలు తక్కువ తీసుకుంటూనే అహర్నిషలు శ్రమించే కార్మికుల విషయంలో కటువుగా ఉండే అధికారులు రూ. కోట్లల్లో ఉన్న బకాయిల విషయంలో మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధి అయితే చాలు జీహుజూర్ అనేలా వ్యవహరించి సంస్థ ప్రయోజనాలను గాలికొదిలేయడం విస్తుగొలుపుతోంది.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని ఆర్మూర్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆర్టీసీ స్థలంలో మల్టీప్లెక్స్‌తో కూడిన భారీ మాల్ నిర్మాణం చేశారు. ఈ మాల్‌కు సంబంధించి జీవన్‌రెడ్డి రూ.7,23,71,807 రెంటల్ చెల్లించాల్సి ఉంది. ఆర్టీసీకి దీన్ని చెల్లించే విషయంలో జీవన్‌రెడ్డి ఏమాత్రం పట్టించుకోకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలను వసూలు చేసే విషయంలో ఆర్టీసీ రీజినల్, డిపో అధికారులు సహా, ఎండీ కూడా ఏ మాత్రం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తూ వచ్చారు. ఈ విషయమై గత ప్రభుత్వానికి కూడా తెలియజేశారో లేదో తెలియని పరిస్థితి. అధికార పార్టీ ఎమ్మెల్యేగా జీవన్‌రెడ్డి ఉన్న నేపథ్యంలో కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా సంస్థ ప్రయోజనాలను అధికారులే గాలికొదిలేయడం గమనార్హం.

కన్నీళ్లు పెట్టుకుంటున్న కార్మికులు..
ఆర్టీసీకి ఒక ప్రజాప్రతినిధి రూ. కోట్లల్లో బకాయిలు చెల్లించకుండా ఉన్నప్పటికీ సీజ్ చేయకుండా వ్యవహరించిన అధికారులు మరోవైపు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులు, సిబ్బంది విషయంలో మాత్రం వేధింపులకు పాల్పడుతున్న ఘటనలు కోకొల్లలు. నిజామాబాద్ జిల్లాలో గతేడాది ఆర్టీసీ కార్మికులు తమ ఆవేదనను కన్నీరు పెడుతూ సన్నిహితుల వద్ద చెప్పుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

సెలవులు కావాలంటే గగనమే..
డ్రైవర్లు, కండక్టర్లు సెలవులు పెట్టాలంటే అదొక పెద్ద ప్రయాస. శుభ, అశుభ కార్యాలకు వెళ్లాలన్నా, ఇంట్లో కుటుంబ సభ్యులు, సమీప బంధువులకు అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు వెళ్లాలంటే కూడా డిపోల్లో అధికారులు సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయి. తప్పని పరిస్థితుల్లో వెళ్తే మృతదేహాల వద్ద, ఆస్పత్రుల్లో ఉంటే పేషంట్ వద్ద నిలబడి సెల్ఫీలు దిగి పంపాలన్న నిబంధనలు కూడా పెట్టిన సందర్భాలు ఉన్నాయి. దీంతో కార్మికులు నరకయాతన అనుభవించారు. మరోవైపు గతంలో ఒక మహిళా కండక్టర్‌ను లక్ష్యంగా చేసుకుని మరీ జిల్లా స్థాయి ఆర్టీసీ అధికారిణి ఇబ్బందులు పెట్టిన సందర్భం ఉంది. ఈ విషయమై సదరు మహిళా కండక్టర్ భోరున విలపించడం పరిస్థితికి నిదర్శనం. ఇక నిత్యం చేసే పనిలో భాగంగా కండక్టర్లు ఏ చిన్న పొరపాటు చేసినప్పటికీ, బస్సులను నడిపే డ్రైవర్ల తప్పు లేకుండా బయటి వాహనాల కారణంగా ఏ చిన్న డ్యామేజీ కలిగినప్పటికీ భారమంతా వారిపైనే మోపుతూ వస్తున్నారు.

ఇలా తమ ప్రతాపాన్ని తమవద్ద పనిచేసే కార్మికులపై చూపుతున్న అధికారులు వాళ్ల బాగోగుల విషయమై ఏమీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఇలాంటి అధికారులు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోట్లాది రూపాయలు బకాయి ఉన్నప్పటికీ తమకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరించడం వీళ్ల పనితీరుకు అద్దం పడుతోంది. పైగా ప్రభుత్వం మారి కొన్ని గంటలు కాకముందే జీవన్‌రెడ్డి మాల్ విషయంలో అప్పటికప్పుడు హడావుడి చేయడం విశేషం.

వాయిదాల పద్ధతికి అవకాశం

- అయినా చెల్లింపుల్లో లెక్కలేనితనం

కరెంటు బిల్లు చెల్లించే విషయంలో జీవన్‌రెడ్డి స్థానిక విద్యుత్ అధికారులను దుర్భాషలాడిన సందర్భాలు అనేకం. బిల్లుల వసూలు విషయంలో స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది తమ ఇబ్బందులపై ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావుకు విన్నవించినప్పటికీ, ఒత్తిడి చేయవద్దని చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలో సిబ్బంది పదేపదే బకాయిల కోసం వెళ్తుండడంతో జీవన్‌రెడ్డి 12 వాయిదాల్లో చెల్లించేలా 2023 ఫిబ్రవరి 4న సీఎండీ నుంచి అనుమతి తెచ్చుకున్నారు. దీని ప్రకారం 18శాతం వడ్డీతో పాటు సర్‌ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సదరు నెలవారీ బిల్లు కూడా చెల్లించాలి. లేనిపక్షంలో విద్యుత్ సరఫరా నిలిపేయాల్సి ఉంటుంది. అయితే జీవన్‌రెడ్డి మాత్రం ఒక్క వాయిదా మాత్రమే చెల్లించడం జరిగింది. మళ్లీ కథ మొదటికి వచ్చింది. ఈ క్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ మరోసారి 2023 అక్టోబర్ 13న వాయిదాల చెల్లింపునకు అనుమతి లేఖ ఇచ్చారు.

అయినప్పటికీ మళ్లీ ఇదేకథ పునరావృతం అయింది. వాయిదాతో పాటు నెలవారీ బిల్లు కూడా చెల్లించలేదు. అయినప్పటికీ సరఫరా కొనసాగించారు. మొత్తం ఎపిసోడ్‌లో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కలిసి ఆడిన గేమ్‌లో స్థానిక సిబ్బంది అనేక ఇబ్బందులు పడ్డారు. జీవన్‌రెడ్డి మాల్‌కు విద్యుత్ సరఫరా తొలగించొద్దని, బకాయి విషయంలో బతిమిలాడాలని సిబ్బందికి సీఎండీ సూచించినట్లు తెలిసింది.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి


వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు తదితరులు

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : 18 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న వారందరినీ ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకునేలా చూడాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. పోలింగ్ బూత్ వారీగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులతో కలిసి త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీసీలో నిర్వహించారు. అదనపు కలెక్టర్లు చిత్రా మిశ్రా, యాదిరెడ్డిలతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీసీలో నుంచి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు. ఎన్నికల ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను సక్సెస్ నిర్వహించడంపై సీఈవో జిల్లా కలెక్టర్లను అభినందించారు. వీసీ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులతో మాట్లాడుతూ, జనవరి 1వ తేదీలోపల 18ఏళ్లు పూర్తి చేసుకుంటున్న యువత ఓటర్లుగా నమోదయ్యేలా కృషిచేయాలన్నారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని, జనవరి 06 వ తేదీన డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆ తర్వాత కూడా ఏవైనా మార్పులు, చేర్పులకు సంబంధించి జనవరి 22 వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంటుందన్నారు. వచ్చిన దరఖాస్తులను 2024 ఫిబ్రవరి 2వ తేదీ వరకు పరిశీలన పూర్తి చేసి, ఫిబ్రవరి 8వ తేదీన తుది ఓటరు జాబితాను వెలువరించాలన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వే చేపట్టి పరిశీలన చేపట్టాలన్నారు. వందేళ్లు దాటిన వారి వివరాలను సేకరించాలన్నారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ఇంకనూ ఎక్కడైనా కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంటే ప్రతిపాదనలు పంపాలన్నారు. ముఖ్యంగా 1,450 పైచిలుకు ఓటర్లు కలిగిన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదించాలన్నారు. వీసీలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరందు, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, వినోద్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

నిజామాబాద్ రూరల్ : తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెలలో జరిగే డిగ్రీ పరీక్షల నిర్వహణ గురించి కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ సెమినార్ హాలులో జరిగిన సమావేశానికి డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ కట్టుదిట్టంగా ఉండాలని కళాశాల పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసే విద్యార్థిని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, సౌకర్యవంతమైన సీటింగ్ అరేంజ్మెంట్‌తో పాటు తాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షలు సమయపాలన పాటిస్తూ కళాశాల యాజమాన్యం మాల్ ప్రాక్టీస్‌కు సహకరించకుండా వర్సిటీ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం పరీక్షల నియంత్రణ అధికారిని ఆచార్య అరుణ మాట్లాడుతూ కళాశాలలకు కావాల్సిన స్టేషనరీ ముందస్తుగా విశ్వవిద్యాలయం నుంచి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ బి సాయిలు, డాక్టర్ బి నందిని, శాంతాబాయి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు, తెయూ పరీక్షల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

- ఆర్టికల్ 370 రద్దుపై..
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్ : జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్యతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను ఉపసంహరించుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసిందన్నారు. అలాగే జార్ఖండ్ కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ధీరజ్ సాహు అక్రమ సంపాదనపై రాహుల్, సోనియా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అవినీతి పాలన, కుటుంబ పాలన దేశానికి ప్రమాదకరమని ప్రధాని మోదీ గతంలోనే పేర్కొన్నారన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాటక నుంచి తెలంగాణకు రూ. వందల కోట్లు మళ్లించారని ఆరోపించారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల్లో కూడా డబ్బులు వెదజల్లి కాంగ్రెస్ గెలవాలని కుట్రలు పన్నుతుందని, ఆ పప్పులు ఉడకవన్నారు. మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతోందని, ఈసారి 400 స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అంటేనే స్కాంగ్రెస్ అని, గత కాంగ్రెస్ పాలనలో లక్షల కోట్ల అవినీతి బయటపడిందని ఆరోపించారు. అవినీతి రహిత పాలనను అందిస్తున్న బీజేపీకే దేశ ప్రజలు మరోసారి పట్టం కట్టాలని సిద్ధమయ్యారన్నారు. స్థానిక సమస్యలు ఇతర అంశాలపై పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల వెంకటేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, మోర్చాల అధ్యక్షుడు పంచరెడ్డి ప్రవళిక, బీఆర్ శివప్రసాద్, బద్దం కిషన్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

గోదారమ్మ నిర్మలత్వాన్ని కాపాడాలి


కందకుర్తి సందర్శనకు వచ్చిన అయోధ్య సాధువులు


గోదావరికి హారతి ఇస్తున్న సాధువులు


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

- గోదావరిని సందర్శించిన అయోధ్య సాధువులు
- కందకుర్తి త్రివేణి సంగమం వద్ద ప్రత్యేక పూజలు

బోధన్ : దేశంలోనే జీవనదుల్లో ఒకటైన గోదారమ్మ పవిత్రతను, నిర్మలత్వాన్ని కాపాడుకోవాలని అయోధ్యకు చెందిన సాధువులు సూచించారు. నది కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన మంగళ పీఠాధిపతి మాధవాచార్య ఆధ్వర్యంలో అయోధ్య, వివిధ ప్రాంతాలకు చెందిన 200 మంది సాధువులు గోదావరి పరిక్రమణ యాత్రను చేపట్టారు. ఈనెల 1న గోదావరి జన్మస్థలం నాసిక్(త్రయ్యంబకేశ్వర్) నుంచి యాత్రను ప్రారంభించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అంతర్వేది వరకు యాత్రను కొనసాగించి తిరుగుప్రయాణంలో మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న రెంజల్ మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమ క్షేత్రం సోమవారం చేరుకున్నారు. ఇక్కడి నుంచి బయలుదేరి ఈనెల 14న త్రయంబకేశ్వర్‌కు చేరుకుని యాత్ర ముగించనున్నారు. కందకుర్తి గోదావరి త్రివేణి సంగమ క్షేత్రం మహరాజ్ సీతారాం త్యాగి, అర్బన్ బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీలు లోలం రజనీ కిషోర్, మేక విజయ సంతోష్ తదితరులు ఘనస్వాగతం పలికారు. మంగళహారతులతో మహిళలు సాధువుల ముందువరసలో నడిచారు. సాధువులతో కలిసి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ కందకుర్తి గ్రామంలోని శ్రీరామ మందిరం, నది ఒడ్డున ఉన్న శివాలయంను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సాధువుల ఆశీస్సులు తీసుకున్నారు.

గోదావరికి మహాహారతి
పవిత్ర కార్తీకమాసం ఆఖరి సోమవారం పురస్కరించుకుని గోదారమ్మకు మహాహారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గోదావరి నదికి సాధువులు మహాహారతి ఇచ్చారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. డివిజన్లోని వివిధ మండలాల్లోని ఆలయాల పూజారులు, భక్తులు సాధువులను దర్శించుకున్నారు.

వసతి లేక విద్యార్థినుల విలవిల

- ప్రతిపాదనలు పంపి మూడేళ్లు..
- మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో పరిస్థితి



నిజామాబాద్‌అర్బన్ : మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో వసతిగృహం అందుబాటులో లేక విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా పాలకులు పట్టించుకోకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్న విద్యార్థినులు వసతిలేక అగచాట్లు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్‌లో మహిళ పాలిటెక్నిక్ కళాశాల ఉంది. ఇక్కడ 360 మంది విద్యార్థినులకు మూడు బ్రాంచ్‌లలో విద్యాబోధన కొనసాగుతుంది. ప్రతిఏటా రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థినులు సీటు కేటాయిస్తే ఇక్కడికి వచ్చి విద్య కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని విద్యార్థినులు సైతం ఇక్కడ విద్యానభ్యసిస్తున్నారు. కాని వీరికి వసతి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కేవలం 180 మంది విద్యార్థినులకు మాత్రమే వసతి ఏర్పాటు ఉంది. మిగితా వారికి చోటు లేకుండా పోయింది. ఈ విద్యార్థినులు బయట రూంలు రెంట్‌కు తీసుకుని చదువుకుంటున్నారు. కొందరు హాస్టల్ వసతి లేక సీట్లను వదులుకుని వెళ్తున్నారు.

మూడేళ్లయినా...
మరో వసతిగృహం ఏర్పాటు చేయాలని పాలిటెక్నిక్ కళాశాల అధికారులు ప్రభుత్వానికి మూడేళ్ల కిందట ప్రతిపాదనలు పంపారు. దీనిపై ఇప్పటి వరకు స్పందన లేదు. ఓ వైపు విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు ప్రస్తుతం ఉన్న వసతిగృహం కూడా శిథిలావస్థకు చేరింది. ప్రజాప్రతినిధులు పట్టించుకోని మరో వసతి గృహం ఏర్పాటు చేయాలని అధికారులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..



జిల్లాలో మరో వసతిగృహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి మూడేళ్ల కిందట ప్రతిపాదనలు పంపాం. మంజూరు చేస్తామని చెప్పారు. కాని ఇంతవరకు మంజూరు కాలేదు. మరొకసారి ప్రతిపాదనలు పంపుతాం.
– నరేశ్, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

పేదలపై అదనపు భారం



పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో దూర ప్రాంతాల్లో నుంచి వచ్చిన వారికి ప్రతి ఒక్కరికి హాస్టల్ అడ్మిషన్ ఇవ్వాలి. దూరప్రాంతాల వారికి అడ్మిషన్ ఇవ్వకపోవడంతో ప్రైవేట్ హాస్టళ్లలో వేలకు వేలు పెట్టి ఉండాల్సిన పరిస్థితి ఉంది.
– ఆకుల దేవిక, పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి

మరో హాస్టల్ నిర్మించాలి..



360 మందికి కళాశాలలో అడ్మిషన్లు ఉండగా ప్రభుత్వ హాస్టల్‌లో మాత్రం 180 మందికి హాస్టల్ వసతి ఉంది. మిగితా విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. కావున సంబంధిత అధికారులు మరొక హాస్టల్ నిర్మించి న్యాయం చేయాలి.
– జయంతి, యూనివర్సిటీ పీడీఎస్‌యూ కార్యదర్శి

శివాలయాల్లో సందడి..

కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు


నీలకంఠేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నిజామాబాద్ సిటీ: కార్తీకమాసం చివరి సోమవారం జిల్లాలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రివరకు శివాలయాలకు భక్తుల తాకిడితో శివయ్య దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, గంజ్‌లోని ఉమా మహేశ్వర ఆలయం, నందిపేట్ కేదారీశ్వర ఆలయం, బోధన్ చక్రేశ్వర ఆలయం, వినాయక్‌నగర్‌లోని శివాలయం, హైదరాబాద్‌రోడ్డు శివాలయం భక్తులతో రద్దీగా మారింది. ఈ సందర్భంగా భక్తులకు గర్భగుడిలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాలలో మహిళలు తులసీ కోటల ముందు పిండితో తయారు చేసిన దీపాలను వెలిగించారు. బ్రాహ్మణులకు దీపాలు దానం చేశారు.


నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి

క్లుప్తంగా

ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తే చర్యలు



మాక్లూర్: ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తే ఎంతటి వారినైనా ఊపేక్షించనని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి హెచ్చరించారు. ఇంత కాలం అధికారులను బెదిరించి దొడ్డిదారిన అనుమతులు తెచ్చుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కంకర, మొరం క్వారీ యజమానులు ఇక నుంచి పద్ధతి మార్చుకోవాలన్నారు. సోమవారం మండలంలోని మాదాపూర్‌లో ఉన్న కంకర క్వారీలను ఆయన పరిశీలించారు. అనుమతులు ఉన్నాయా లేదా అనేది క్వారీ యజమానులను అడిగి తెలుసుకున్నారు. అలాగే జీఎస్టీ చెల్లిస్తున్నారా లేదా అనేది కూడా ఆరా తీయాలని మైన్స్ ఏడీ సత్యనారాయణను ఆదేశించారు. క్వారీలకు అనుమతి ఎన్ని ఎకరాల్లో ఉంది, తవ్వకాలు ఎక్కడెక్కడ జరుపుతున్నారు అనేది కూడా తెలుసుకోవాలని ఆదేశించారు. అప్పటి వరకు క్వారీలను సీజ్ చేయాలని మైన్స్ ఏడీకి సూచించారు. క్వారీల నుంచి రోడ్లను ఎలా వేశారని ప్రశ్నించారు. రైతులను బెదిరించి రోడ్లు వేశారా అని ఆరా తీశారు. మాదాపూర్, చిన్నాపూర్ ప్రాంతాల్లో కంకర, మొరం క్వారీలు అక్రమంగానే కొనసాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని తెలిపారు. అక్రమాలు బయట పడితే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, ఆర్‌ఐ షఫీ, నాయకులు పెద్దోళ్ల గంగారెడ్డి, పాలేం రాజు, అనిల్‌కుమార్, వినోద్, మెదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంక్రీట్ క్రషర్ పరిశీలన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ శివారులో నిర్వహిస్తున్న కాంక్రీట్ క్రషర్‌ను ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే క్రషర్ అనుమతులను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా క్రషర్ నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



సిరికొండ: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ నాగేష్ సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో కామారెడ్డిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి రామ్‌చరణ్, నితిన్, షాహెద్, భరత్, శివకాంత్, సిద్దు, జాగృతి, అమ్ములు, అఖిల, రసజ్ఞ, జష్విత, శ్రీనిధి, అక్షయ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 16 నుంచి 18 వరకు కామారెడ్డిలో జరుగుతాయని పేర్కొనినారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం రాములు, సర్పంచ్ బాలమణిమల్లేష్, ఎంపీటీసీ లింగం, ఎస్‌ఎంసీ చైర్మన్ లావణ్య, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విశాఖ గంగారెడ్డి, రమణ అభినందించారు.

సాక్షి స్పెల్‌బీకి విశేష స్పందన

నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో సోమవారం 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలకు విశేష స్పందన లభించింది. ఈ పరీక్షల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. వివిధ కేటగిరిల వారీగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా 'డ్యూక్స్ వ్యాఫి', అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించింది.

SAKSHI MATH BEE 2023-24
SAKSHI SPELL Bee 2023-24



నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన స్పెల్‌బీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఎంతో ఉపయోగం



సాక్షి స్పెల్ బీ పరీక్ష ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పరీక్ష కోసం కొద్ది రోజులుగా ప్రిపేరయ్యాను. పరీక్ష కోసం మా ఉపాధ్యాయులు సన్నద్ధం చేశారు.

– కృతజ్ఞ, ఐదో తరగతి

మళ్లీ పరీక్షకు హాజరవుతా..



సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షకు హాజరు కావడం హ్యాపీగా ఉంది. వచ్చే ఏడాది నిర్వహించే పరీక్షకు మళ్లీ హాజరవుతా. దీనికి ముందు నుంచే ప్రిపేర్ అవుతా.

– ఇందుమతి, ఐదో తరగతి

నమ్మకం కలిగింది



ఈ పరీక్షతో నాకు ఎంతో నమ్మకం కలిగింది. ఇతర పరీక్షలు బాగా రాయగలుగుతాననే నమ్మకం ఏర్పడింది. గత కొన్ని రోజులుగా పరీక్షకు సన్నద్ధమవుతున్నాను. పరీక్ష బాగా రాశాను.

– విఘ్నేష్, ఐదో తరగతి

పోటీ పరీక్షల మాదిరిగా ఉంది



సాక్షి నిర్వహించిన ఈ పరీక్షతో పోటీ పరీక్షలను కూడా రాయగలననే నమ్మకం ఏర్పడింది. నా తల్లిదండ్రులు కూడా ఎంతో ప్రోత్సాహం అందించారు. మంచి అనుభవం ఏర్పడింది.

– అయాస్‌ఖాన్, పదో తరగతి

ప్రతిభ వెలుగులోకి..



సాక్షి నిర్వహించిన ఈ పరీక్షలతో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఇలాంటి పరీక్షలు మళ్లీ నిర్వహించాలి. విద్యార్థుల భవిష్యత్ కోసం ఉపయోగపడుతుంది.

– సాత్విక్, ఎనిమిదో తరగతి

భయం పోయింది



ఇంగ్లిష్ సబ్జెక్టుపై లోతైన అవగాహన కోసం స్పెల్ బీ పరీక్ష దోహదపడింది. నేను ఇంగ్లిష్ ఎలా చదవాలో తెలిసింది. గత ఏడాది కూడా ఈ పరీక్షకు హాజరయ్యాను. ఇంగ్లిష్ భాషపై ఉన్న భయం పూర్తిగాపోయింది.

– అనన్య, ఎనిమిదో తరగతి

లెక్కలు ఎలా చేయాలో తెలిసింది



నేను అన్ని సబ్జెక్టులు బాగానే చదువుతాను. కానీ గణితం బాగా భయంగా ఉండేది. సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్ష రాసిన తర్వాత భయం పోయింది. లెక్కలు ఏవిధంగా చేయాలో తెలిసింది.

– షేక్ యూసుఫ్, ఎనిమిదో తరగతి

స్పీడ్‌పోస్టు మాయం!

- తొర్లికొండ పోస్టాఫీస్‌లో నిర్లక్ష్యం
- ఒరిజినల్ సర్టిఫికెట్ అందక ఆందోళనలో విద్యార్థి
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

ఆర్మూర్: జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణ్‌పల్లికి చెందిన ఓ విద్యార్థికి వచ్చిన స్పీడ్ పోస్టు మాయం అయింది. గ్రామానికి చెందిన ఎస్ ప్రణవి హైదరాబాద్‌లోని గురునానక్ ఇంజినీరింగ్ కాలేజీలో బీ టెక్ పూర్తి చేసింది. ఆమె తన ఒరిజినల్ ధ్రువ పత్రం (కాన్వొకేషన్) కోసం ఆన్‌లైన్‌లో జేఎన్‌టీయూకు దరఖాస్తు చేసుకుంది. పోస్టులో ఇంటికి రావాల్సిన సర్టిఫికెట్ ఎంతకు రాకపోవడంతో ఆమె జేఎన్‌టీయూలో వాకబు చేసింది. దీంతో యూనివర్సిటీ సిబ్బంది ఏప్రిల్‌లోనే పోస్టులో పంపామని చెప్పారు. ప్రణవి తొర్లికొండ పోస్టాఫీసులో పోస్టు మాస్టర్ స్మితను వాకబు చేయగా సర్టిఫికెట్లు పోస్టులో వచ్చాయి కానీ బ్రాహ్మణ్‌పల్లిలో విద్యార్థి ఇంటి నంబర్ దొరకకపోవడంతో ఆర్మూర్‌లోని జిరాయత్‌నగర్ సబ్ పోస్టాఫీసుకు రిటర్న్ పంపించానని చెప్పారు. ఆమె జిరాయత్‌నగర్ పోస్టాఫీసులో వాకబు చేయగా 2023 ఏప్రిల్ 17న తొర్లికొండ పోస్టాఫీసుకు పంపించామని, అక్కడి నుంచి తమకు తిరిగి రాలేదని పేర్కొన్నారు. తొర్లికొండ పోస్టాఫీస్‌లోనే సర్టిఫికెట్ మిస్ అయినట్లు జిరాయత్‌నగర్ పోస్ట్ మాస్టర్ ఆంజనేయులు అధికారికంగా ఒక లెటర్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఆందోళనకు గురైన ప్రణవి జేఎన్‌టీయూలో సంప్రదించగా మళ్లీ ఒరిజినల్ సర్టిఫికెట్ ఇవ్వలేమంటూ తేల్చి చెప్పారు. దీంతో ఆమె తనకు వచ్చిన సర్టిఫికెట్‌ను మాయం చేసిన తొర్లికొండ పోస్టుమాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించింది. వీరిపై కేసు నమోదు చేసి తిరిగి దరఖాస్తు చేసుకుంటేగాని ఆమెకు డూప్లికేట్ సర్టిఫికెట్ వచ్చే పరిస్థితులు లేవు.

ప్రైవేట్ వ్యక్తితో పంపిణీ..

తొర్లికొండలో పోస్టు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న స్మిత లెటర్లను డిస్పాచ్ చేయకుండా అదే గ్రామంలో ప్రైవేటు ఉపాధ్యాయుడు కొలిప్యాక రామును అనధికారికంగా నియమించుకుంది. ఆయనతో అన్ని లెటర్లను పంపిస్తు ఉంటుంది. బ్రాహ్మణ్‌పల్లిలో ఇంటి నంబర్‌తో అడ్రస్ దొరకకపోవడం ఉండదు. కానీ సదరు వ్యక్తి బాధ్యతారాహిత్యంతో వ్యవహరించి స్పీడ్ పోస్టులో వచ్చిన సర్టిఫికెట్‌ను తిరిగి ఆఫీసులో ఇచ్చేశాడు. దానిని మెసెంజర్ ద్వారా జిరాయత్‌నగర్‌కు పంపించానని చెబుతున్నా.. ఆ పోస్టు జిరాయత్‌నగర్ కార్యాలయానికి చేరలేదు.

దొరకడం లేదు



జేఎన్‌టీయూ నుంచి స్పీడ్ పోస్టు తొర్లికొండ బ్రాంచ్‌కి వచ్చింది. బ్రాహ్మణ్‌పల్లిలో అడ్రస్ దొరకకపోవడంతో మెసెంజర్ ద్వారా జిరాయత్‌నగర్ బ్రాంచ్‌కి పంపించాను. ప్రస్తుతం సర్టిఫికెట్‌ను వెతికినా దొరకడం లేదు.

– స్మిత, పోస్టు మాస్టర్, తొర్లికొండ బ్రాంచ్, జక్రాన్‌పల్లి మండలం

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా శివ



బచ్చనబోయిన శివ

నిజామాబాద్‌రూరల్: ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు బచ్చనబోయిన శివ ఎన్నికయ్యారు. ఈ నెల 7 నుంచి 10 వరకు ఢిల్లీలో 69వ మహాసభలు జరిగాయి. ఈ మహాసభల్లో జాతీయ కార్యవర్గ సభ్యుడిగా శివను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడుతానన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కరుణాకర్‌రెడ్డి



కరుణాకర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ సామల కరుణాకర్‌రెడ్డి నియమిలయ్యారు. ఢిల్లీలో జరిగిన జాతీయ మహాసభల్లో తెలంగాణ రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి, ప్రాంత సంఘటన మంత్రి కరుణాకర్‌కు కరుణాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు



నగరంలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు

సుభాష్‌నగర్: జిల్లాలోని గ్యాస్ సిలిండర్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు బారులు తీస్తున్నారు. ఆధార్ లింకేజీ కోసం ఈ–కేవైసీ చేయించుకోవాలని ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి. కానీ కొందరు ఈవిషయంలో అపోహ పడుతూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ–కేవైసీ చేయించుకుంటేనే గ్యాస్ సిలిండర్ రూ.500కే వస్తుందని వినియోగదారులు ఏజెన్సీల వద్దకు బారులు తీస్తున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు ఈ–కేవైసీకి గడువు ఇంకా ఉందని వినియోగదారులను సముదాయిస్తున్నా.. పట్టించుకోవడం లేదు. నగరంలో పలుచోట్ల పోలీస్‌బందోబస్తు నడుమ ఈ–కేవైసీ చేస్తుండటం గమనార్హం. కాగా ఉజ్వల యోజన కింద గ్యాస్ సిలిండర్ పొందిన వినియోగదారులు డిసెంబర్ 31వరకు ఈ–కేవైసీ చేయించుకోవాలని ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి. ఈ గడువును ఇంకా పెంచే అవకాశం కూడా ఉంది. సాధారణ గ్యాస్ సిలిండర్ వినియోగదారులు మాత్రం మార్చి 31వరకూ ఎప్పుడైనా ఈ–కేవైసీ చేయించుకోవచ్చని ప్రకటించినట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తుందనే అపోహతో ప్రజలు ఏజెన్సీల వద్దకు పరుగెత్తుతున్నారు. చాలా మంది పేదలు పనులు వదిలేసి భారీ క్యూలైన్లలో నిల్చొని ఈ–కేవైసీ చేయించుకుంటున్నారు. ఈ–కేవైసీ చేయించుకున్న వారు రూ.500కే సిలిండర్ ఇవ్వాలని అడుగుతుండటంతో ఏజెన్సీ నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. ఇదే విషయమై పౌరసరఫరాలశాఖ అధికారుల వివరణ కోరగా, ఈ–కేవైసీకి సంబంధించి తమకు ఎలాంటి సమాచారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాలేదని, గడువు విషయం తెలియదని తెలిపారు.

పెండింగ్ ఫిర్యాదులు పరిష్కరించాలి



నిజామాబాద్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

సుభాష్‌నగర్: ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 38 ఫిర్యాదులు అందాయి. రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక విరామం అనంతరం సోమవారం నుంచి ఈ కార్యక్రమాన్ని తిరిగి చేపట్టారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కాగా ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి వినతులపై చేపట్టిన చర్యల గురించి ఫిర్యాదుదారులకు తప్పని సరిగా సమాచారం తెలియజేస్తూ, ప్రజావాణి సైట్‌లో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు.

ల్యాండ్ రికార్డ్స్ ఏడీపై ఫిర్యాదు

సుభాష్‌నగర్: వేల్పూర్ మండలంలోని శాయంపేట్ శివారులోగల 60 నుంచి 74 సర్వేనెంబర్లలోని తనకు చెందిన 29 ఎకరాల భూమి సరిహద్దులు గుర్తించాలని కొండి లక్ష్మి కోరారు. ఈ మేరకు ఆమె ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులును పిలిచారు. కలెక్టర్ ఎదుటే ఏడీపై లక్ష్మి ఆరోపణలు చేశారు. హద్దులు గుర్తించేందుకు రూ.ఐదు లక్షలు లంచం డిమాండ్ చేశారని ఆరోపించింది. ఆమె మాట్లాడుతూ తన భూమిలో ఏడు ఎకరాలను కొందరు కబ్జా చేశారని ఆరోపించారు. ఆ భూమికి సంబంధించి హద్దులు గుర్తించాలని నాలుగేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాదారులకు నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి అండదండలు ఉన్నాయని ఆరోపించారు.

కామారెడ్డిలో 30 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: శాఖల వారిగా అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. దాదాపు 8 వారాల అనంతరం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కలెక్టర్ పాటిల్, అధికారులు ఫిర్యాదుదారుల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 30 ఫిర్యాదులు రాగా వాటిలో 16 రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ సమస్యలవే కావడం గమనార్హం. అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. అదనపు కలెక్టర్ మను చౌదరి, డీఆర్‌డీవో సాయన్న, ఏవో మన్సూర్ అహ్మద్, తహసీల్దార్ సాయి భుజంగ రావు, డీపీఎం సుధాకర్ పాల్గొన్నారు.



కామారెడ్డిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పాటిల్

చెక్కు అందజేత

తాడ్వాయి మండలంలో ఐకేపీ సమన్వయకర్తగా పనిచేసిన సాయిలు ఇటీవల మృతి చెందగా ఉద్యోగుల బీమా కింద మంజూరైన రూ.1.50 లక్షల చెక్కును కలెక్టర్ మృతుడి భార్య సవితకు అందజేశారు.

మానవ హక్కులపై అవగాహన



ఖలీల్‌వాడి: మానవ హక్కుల పరిరక్షణ కోసం ఎంతో మంది కృషి చేస్తున్న ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయని రిటైర్డ్ జడ్జి రాంచందర్ అన్నారు. ఆమెన్ జస్టిస్ ఫర్ సిటిజెన్స్ హ్యూమన్ రైట్స్ అండ్ వరల్డ్ సోషల్ పీస్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ ఉల్లెంగ నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద కార్యాలయంలో మానవ హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్గం విజయ్ కుమార్ పటేల్, అమీర్ హుస్సేన్, ఆకుల నవీన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వైద్యురాలు మృతి

నిజామాబాద్‌రూరల్: మాధవనగర్ శివారులోని ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రిలో మత్తుమందు వైద్యురాలిగా పనిచేస్తున్న పైల సౌమ్య(28) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. వ్యక్తిగత కారణాలతో తనకు తానే మత్తు ఇంజెక్షన్ తీసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. సౌమ్య తండ్రి శ్రీమన్నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న జీపు



ఎడపల్లి: మండలంలోని ఎంఎస్‌సీ ఫారం వద్ద సోమవారం ట్రాక్టర్ ట్రాలీని జీపు వెనక నుంచి ఢీకొంది. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో డీజిల్ కొట్టించడానికి యూటర్న్ తీసుకుంటుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో జీపులో ప్రయాణిస్తున్న 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఒక మహిళకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



రామారెడ్డి: అనారోగ్య సమస్యలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లక్కాకుల మానస(27)కు ఇద్దరు కుమారులు. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భిణి. మానస కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. అంతేగాకుండా గతంలో సిజేరియన్ అయిన కుట్లు నొప్పిగా ఉన్నాయని భర్త రవితో చెప్పింది. ఆస్పత్రికి వెళ్దామని చెప్పి రవి బయటకు వెళ్లాడు. అనంతరం ఆమె ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

కుటుంబ తగాదాలతో ఒకరు..

భిక్కనూరు: మండల కేంద్రంలో ఒక్కరూ కుటుంబ తగాదాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయి కుమార్ సోమవారం తెలిపారు. భిక్కనూరుకు చెందిన బత్తిని వెంకటేశ్(26) బ్యాండ్ మేళం వాయిస్తూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య తిరుమల, ఇద్దరూ కుమారులు ఉన్నారు. వెంకటేశ్‌కు మూడు నెలల క్రితం కుమారుడు జన్మించడంతో ఆయన భార్య తిరుమల తల్లిగారి గ్రామమైన జగిత్యాల జిల్లా చెర్ల కొండాపూర్‌లో ఉంటుంది. వెంకటేశ్‌కు తన పినతల్లి మంజులతో తరుచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వెంకటేశ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య తిరుమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో..

ధర్పల్లి: అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి ధర్పల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శిరస్సు విజయ్ (38)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయ్‌కి కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యల తోపాటు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో జీవితం విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నిరీక్షణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

ఎడపల్లి: చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని వడ్డేపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అశోక్ సింగ్ (55) ఆదివారం రాత్రి ఠాణాకలాన్ శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, మృతుడి కొడుకు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని జెండాగల్లీకి చెందిన హారిక అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆమె ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తోంది. శనివారం ఆస్పత్రికి వెళ్లి తిరిగి రాలేదు. ఆస్పత్రిలో వాకబు చేయగా రాలేదని చెప్పారు. పలుచోట్ల గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో హారిక భర్త వినయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.